వేటగాళ్ల ఉచ్చుకు మూగజీవాలు బలి

- వన్యప్రాణులే లక్ష్యంగా అడవిలో ఉచ్చులు
- 'మామూలు'గా తీసుకుంటున్న అధికారులు?

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 5 : మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని అన్నారం, రాపల్లికోట, ఎన్కపల్లితోపాటు పలు గ్రామాల్లో వేటగాళ్ల ఉచ్చులకు మూగజీవాలు బలవుతున్నాయి. ఇటీవల మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయ సమీపంలోనే వేటగాళ్లు వన్యప్రాణుల కోసం ఉచ్చులు అమర్చిన సంఘటన వెలుగులోకి రావడం కలకలం రేపింది. వన్యప్రాణుల వేటపై వార్త కథనాలు వచ్చినప్పుడు అధికారులు హడావిడి చేసి చేతులు దులుపుకొని 'మామూలు'గా తీసుకోవడంతోనే దుండగులు రెచ్చిపోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండల పరిధిలోని కుదురుపల్లి గ్రామ శివారులోని సాడ్రేవు వాగు సమీప అటవిలో వేటగాళ్లు అమర్చిన ఉచ్చు తీగలకు ఓ ఆవుదూడ చిక్కి బలైపోయిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొందరు గొర్రెల కాపరులు మేత కోసం అటవీక్షేత్రాలకు వెళ్లడంతో అక్కడ వేటగాళ్లు అమర్చిన ఉచ్చు తీగలకు ఓ ఆవుదూడ చనిపోయినట్లు గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. ఈ విషయంపై ఎఫ్ఆర్వో రవిని వివరణ కోరగా మండలంలో వన్యప్రాణుల కోసం ఎక్కడా ఉచ్చులు అమర్చినట్లు తమ దృష్టికి రాలేదన్నారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం అటశీశాఖ సిబ్బంది నిత్యం అడవుల్లో పెట్రోలింగ్, గస్తీ నిర్వహిస్తున్నారని, వన్యప్రాణులను వేటాడితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

వన్యప్రాణులకు హాని తలపెడితే చర్యలు : డీఎఫ్వో

కాటారం, మార్చి 5 : వన్యప్రాణులకు హాని తలపెట్టాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి డీఎఫ్వో నవీన్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని దామెరకుంట, గుండ్రాత్‌పల్లి అటవీ ప్రాంతాన్ని అటవీశాఖ సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. గుండ్రాత్‌పల్లి-అన్నారం అటవీ ప్రాంతంలో పెద్ద పులి సంచరించిందనే సమాచారంతో వాగుల వద్ద, పలు చోట్ల పులి ఆచూకి కోసం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎఫ్వో మాట్లాడుతూ అటవీప్రాంతంలో ఉచ్చులు ఏర్పాటు చేసిన, వన్యప్రాణులను వేటాడిన చర్యలు తీసుకుంటామన్నారు. పులి సంచారం దృష్ట్యా సమీప ప్రాంత ప్రజలు అటవీప్రాంతంలోకి రావొద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఎఫ్ఆర్వో స్వాతి, ఎఫ్ఎస్వో చంద్రశేఖర్, సిబ్బంది ఉన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌లో విజేత గణపురం జట్టు

గణపురం, మార్చి 5 : ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి సీనియర్స్ (45 సంవత్సరాల) బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి భూపాలపల్లి జిల్లాలోని గణపురం జట్టు విజయం సాధించినట్లు కెప్టెన్ మామిడిశెట్టి రవీందర్ తెలిపారు. ఫ్రెండ్స్ క్లబ్ చోడవరం వారి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ క్రీడల్లో తెలంగాణ నుంచి హైదరాబాద్‌తోపాటు భూపాలపల్లి జిల్లా నుంచి గణపురం జట్లు హాజరైనట్లు రవీందర్ తెలిపారు. గణపురం జట్టు సభ్యులు అంజత్‌పాషా, సదయ్య, వెంకన్న, శ్రీనివాస్, ఐలయ్య, కుమార్ ప్రతిభ కనబరచి విజయ సాధించినట్లు తెలిపారు. ఏపీలోని చోడవరం ఎమ్మెల్యే సూర్యన నాగ సన్యాసి రాజు షీల్డ్‌తోపాటు రూ.5వేల నగదు అందజేశారు. క్రీడాకారులను భూపాలపల్లి జిల్లా క్రీడా అధికారి చిర్ర రఘుతోపాటు జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అధ్యక్షుడు తిరుపతి, కార్యదర్శి సాంబయ్య, కోశాధికారి, రవీందర్, గణపురం మండల అధ్యక్షుడు మోటపోతుల చందర్‌గౌడ్, సంతోష్, మల్లేశ్, శంకర్, తిరుపతి, దుర్గయ్య, రవి, బుచ్చిరెడ్డి, వీర్ల స్వామి అభినందించారు.

భూపాలపల్లిలో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులను తనిఖీ చేస్తున్న విద్యాశాఖ అధికారులు

ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 1802 మంది విద్యార్థులు హాజరు

భూపాలపల్లి రూరల్, మార్చి 5 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సంస్కృతం, తెలుగు, అరమిబిక్, ఉర్దూ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకన్న తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 8పరీక్ష కేంద్రాల్లో 1901మంది విద్యార్థులకుగాను 1802మంది విద్యార్థులు హాజరుకాగా, 99మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్లైయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్స్ బృందాలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయని, పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు చేసినట్లు ఆయన తెలిపారు.

ములుగు జిల్లాలో 1911మంది విద్యార్థులు హాజరు

ములుగురూరల్, మార్చి 5 : ములుగు జిల్లాలోని 10పరీక్ష కేంద్రాల్లో బుధవారం ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ టీఎస్ దివాకర తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రంలోని వసతులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు పోలీస్ బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తలరించాలని, ఎలాంటి కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లా ఇంటర్మీడియట్ అధికారిణి డీ చంద్రకళ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 2023మంది విద్యార్థులకుగాను జనరల్ 1773, ఒకేషనల్ 250మంది హాజరు కావాల్సి ఉండగా జనరల్‌లో 1673మంది, ఒకేషనల్‌లో 238మంది హాజరయ్యారు. కాగా మొత్తం 1911మంది పరీక్షలు రాశారని తెలిపారు. 112మంది గైర్హాజరయ్యారని వివరించారు. మొదటి రోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఆమె పేర్కొన్నారు.

నలుగురు మావోయిస్టు కొరియర్ల అరెస్టు

ఏటూరునాగారం, మార్చి 5 : సీపీఐ మావోయిస్టు పార్టీకి కొరియర్లుగా పనిచేస్తున్న నలుగురిని వెంకటాపురం మండలం విజయపురి కాలనీ సమీపంలో కొత్తపల్లి క్రాస్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు స్థానిక ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఊసూర్ బ్లాక్‌లోని గుంజేపర్తి గ్రామానికి చెందిన బాడిసె అనీల్, పవురుగూడెం గ్రామానికి చెందిన కురామి భామన్, మాడవి సుక్కు, సోడి ఇడుమాల్‌లు చర్ల వైపు నుంచి ఆటో దిగి నడుచుకుంటూ పోలీస్ పార్టీని చూసి పారిపోతుండగా అనుమానాస్పద స్థితిలో ఉన్న వీరిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలిపారు. విచారణలో వీరు నలుగురు మావోయిస్టు పార్టీకి పనిచేస్తున్నట్లు వెల్లడైందన్నారు. ఈ నలుగురు నేరం అంగీకరించారని, దీంతో వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. సమావేశంలో వెంకటాపురం సీఐ కుమార్, ఎస్సై తిరుపతిరావులు పాల్గొన్నారు.

గండ్ర గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు

గండ్ర గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలు

భూపాలపల్లి రూరల్, మార్చి 5 : భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో అర్బన్ యూత్ అధ్యక్షుడు బుర్ర రాజుగౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర యువజన నాయకుడు, జీఎంఆర్ఎం ట్రస్ట్ చైర్మన్ గండ్ర గౌతమ్‌రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు కటకం జనార్దన్, గండ్ర యువసేన నాయకులు కట్ల పూర్ణచందర్, శ్రీకాంత్ పటేల్, ముత్తు, ప్రేమ్, రాపాల రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందించడం అభినందనీయం

భూపాలపల్లి రూరల్, మార్చి 5 : తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ (టీఎస్‌జేయూ) ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ప్రమాద బీమా పత్రాలు అందించడం అభినందనీయమని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ రాహుల్‌శర్మ చేతుల మీదుగా భూపాలపల్లి జిల్లాలోని జర్నలిస్టులకు వ్యక్తిగత ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో టీఎస్‌జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దొమ్మాటి రవీందర్, ఉపాధ్యక్షుడు గట్టు రవీందర్, సంయుక్త కార్యదర్శులు పల్నాటి రాజు, కడపాక రవి, కోశాధికారి సంగెం శేఖర్, ఆర్గనైజ్ సెక్రటరీ మారేపల్లి చంద్రమౌళి, బొల్లపెల్లి జగన్, ఈసీ సభ్యుడు కే దేవేందర్, మీడియా ఇన్‌చార్జి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

చేపల దొంగతనంపై ఫిర్యాదు

కాటారం, మార్చి 5 : మండలంలోని విలాసాగర్ పెద్ద చెరువులో కొన్ని రోజులుగా చేపల దొంగతనం జరుగుతుందని గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం నాయకులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇప్పటి వరకు సుమారు 4క్వింటాళ్ల మేర చేపలు రాత్రిపూట దొంగతనంగా వచ్చి పట్టుకుంటున్నారని ఫిర్యాదులో తెలిపారు. చేపల దొంగతనంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పెద్దపెల్లి రాజయ్య, ఉపాధ్యక్షుడు అట్టెం కిరణ్, కార్యదర్శి కాపరబోయిన మహేశ్, సభ్యులు స్వామి, రమేశ్, రాంచందర్, శ్రీనివాస్, బాలరాజు, నర్సయ్య, అంజిలు కోరారు.

రోడ్డుపై ఊడిపడిన ఆర్టీసీ బస్సు టైర్

వెంకటాపురం(నూగూరు), మార్చి 5 : ప్రయాణికులతో బయలుదేరిన ఆర్టీసీ బస్సు వెనుక టైర్ రోడ్డుపై ఊడిపడిన ఘటన పాత్రాపురం గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నుంచి వెంకటాపురం మండల కేంద్రానికి ప్రయాణికులతో వస్తున్న ఆర్టీసీ బస్సు పాత్రాపురం గ్రామ సమీపంలోకి చేరుకోగానే వెనుక టైర్ బోల్ట్‌లు విరిగిపోయి టైర్లు ఊడిపోయినట్లు తెలిపారు. రోడ్డుపై నుంచి బస్సు పక్కకు పోవడంతో డ్రైవర్ చాకచక్యంగా బస్సును అదుపు చేశాడని తెలిపారు. బస్సులో సుమారు 50మంది ప్రయాణికులు ఉండగా వారు సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. కాగా, ఈ సంఘటనలో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో తృటిలో పెను ప్రమాదం తప్పినట్లయింది.

కుదురుపల్లిలో మళ్లీ ట్రాఫిక్ జామ్

మహదేవపూర్(కాళేశ్వరం), మార్చి 5 : మండల పరిధిలోని కుదురుపల్లి ప్రధాన రహదారిపై ఇసుక లారీల కారణంగా బుధవారం సుమారు మూడు గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో కాళేశ్వర క్షేత్రానికి వెళ్లే భక్తులు, ప్రయాణికులు, వివిధ పనులకు వెళ్లే ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బంది పడ్డారు. మండలంలోని ఇసుక క్వారీలకు వందల సంఖ్యలో లారీలు రావడంతో రద్దీ పెరిగి నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, విజయలక్ష్మి

భూపాలపల్లి రూరల్/ములుగురూరల్, మార్చి 5 : ఈ నెల 21న తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో ముందస్తుగా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జయశంకర్ భూపాలపల్లి, ములుగు అదనపు కలెక్టర్లు విజయలక్ష్మి, సీహెచ్ మహేందర్‌జీ అధికారులకు సూచించారు. ఈ మేరకు బుధవారం వారు జిల్లా కేంద్రాల్లో పరీక్షల ఏర్పాట్లపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, పోస్టల్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ములుగు జిల్లాలో మొత్తం 21పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, మొత్తం 3134మంది విద్యార్థులు పరీక్షలకు రానున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా 20 పరీక్ష కేంద్రాల్లో 3449 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు కొనసాగుతాయని తెలిపారు. సిట్టింగ్ స్క్వాడ్‌లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులను పరీక్ష కేంద్రాలకు నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల అన్ని సౌకర్యాలు కల్పించాలని అకారులను ఆదేశించారు. ములుగులో అడిషనల్ ఎస్పీ సదానందం, డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు, విద్యుత్‌శాఖ ఈడీ నాగేశ్వర్‌రావు, ఎంఎంవీఐ వినోద్‌రెడ్డి, ఆర్టీసీ కంట్రోలర్ మోహన్, ఎస్టీవో సురేశ్, బ్రాంచ్ పోస్టు మాస్టర్ సురేందర్, ప్రభుత్వ పరీక్షల సహాయ నియంత్రణాధికారి జయదేవ్, భూపాలపల్లిలో డీఈవో ఎం రాజేందర్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్‌రెడ్డి, జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యదర్శి చంద్రశేఖర్, ఎంఈవోలు, అన్ని సెంటర్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

9నుంచి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

రేగొండ, మార్చి 5 : లక్ష్మీనరసింహస్వామి జాతరకు వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించి జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మండలంలోని కొడవటంచ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈనెల 9నుంచి 16వరకు నిర్వహించనున్న నేపథ్యంలో జాతర పనులను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. చేసిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆలయ అర్చకులతో కలిసి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయన వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీవో రవి, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, తహసీల్దార్ స్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, రేగొండ వైద్యాధికారి హిమబిందు, ఏఎస్పీ బోనాల కిషన్, డీఎస్పీ సంపత్‌రావు, ఈవో మహేశ్, చైర్మన్ మల్కనూరి భిక్షపతి, ధర్మకర్తలు సంపత్‌రావు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి రైస్ మిల్లర్ల వినతి

ములుగురూరల్, మార్చి 5 : రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కను హైదరాబాద్ ప్రజాభవన్‌లో ములుగు, భూపాలపల్లి జిల్లాల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదం ప్రవీణ్, పెరుమాండ్ల తిరుపతిగౌడ్‌లు బుధవారం రైస్ మిల్లర్లతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాదం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. స్పందించిన మంత్రి సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించి పరిష్కరించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా కోశాధికారి మోహన్, రైస్ మిల్లర్లు వాసుదేవరెడ్డి, విజేందర్, భూపాలపల్లి కార్యదర్శి యాంసాని సంతోశ్, కోశాధికారి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు భిక్షపతి ఉన్నారు.

సమానత్వంతోనే సమాజ పురోగతి : కలెక్టర్

ములుగురూరల్, మార్చి 5 : సమానత్వంతోనే సమాజ పురోగతి అని, ప్రస్తుతం సమాజంలో ముందుకు పోవాలంటే సమానత అవసరమని, మహిళలు, పురుషులలో విభేదాలు ఉండటం సమాజానికి మంచిది కాదని ములుగు జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లాలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు జిల్లా కేంద్రంలోని గిరిజన భవన్‌లో క్రీడా పోటీలు నిర్వహించగా కలెక్టర్ హాజరై ప్రారంభించారు. మహిళా ఉద్యోగులకు 16 రకాల క్రీడలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ క్రీడలను అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని అన్నారు. మొదటి రోజు షటిల్, స్కిప్పింగ్, చెస్, క్యారమ్, లెమన్ స్పూన్, గన్నీ బ్యాగ్స్, మ్యూజికల్ చైర్, బెలూన్స్ క్రీడలను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి శిరీష, టీజీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పోలు రాజు, సెక్రటరీ కందుల జీవన్‌కుమార్, ట్రెజరర్ ప్రకాశ్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ బీ లక్ష్మీనాయక్, జాయింట్ సెక్రటరీ శైలజ, యశ్వంత్, రఫిక్, మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగంలో సునితకు డాక్టరేట్

బానోత్ సునిత

ములుగురూరల్, మార్చి 5 : మండలంలోని శివతండాకు చెందిన బానోత్ సునితకు డాక్టరేట్‌ను కేయూ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య బోయిని రాజేందర్‌రెడ్డి మంగళవారం ప్రకటించినట్లు సునిత కుటుంబసభ్యులు బుధవారం తెలిపారు. సునిత చైతన్య డిమ్డ్ టు బీ యూనివర్సిటీ ఫార్మసీ విభాగంలో పరిశోధకురాలని తెలిపారు. సునిత స్టడీస్ ఆన్ ఫార్మసూటికల్ అనాలిసిస్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు గ్రీన్ మెథడాలజీ డెవలప్‌మెంట్ ఫర్ సెలెక్టెడ్ అంటీ క్యాన్సర్ డ్రగ్స్ అనే అంశంపై ఫార్మసీ విభాగ అధ్యాపకులు ఆచార్య పీ శంకరయ్య పర్యవేక్షణలో పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి గాను డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. కాగా, యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ పి.హెచ్. సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం రవీందర్‌తోపాటు పలువురు సునితకు శుభాకాంక్షలు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

రేగొండ, మార్చి 5 : మండల కేంద్రానికి చెందిన గండి సదయ్య (58) అనే గీతకార్మికుడు కుల వృత్తిలో భాగంగా బుధవారం సాయంత్రం జగ్గయ్యపేట రోడ్డు సమీపంలోని తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు చికిత్స నిమిత్తం 108ద్వారా ఆసుపత్రికి తరలించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ములుగురూరల్, మార్చి 5 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సందీప్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా సైబర్ క్రైమ్ కోఆర్డినేట్ సెంటర్ ఆధ్వర్యంలో జంగాలపల్లి గ్రామంలోని మహిళా కమ్యూనిటీ సెంటర్‌లో మహిళా స్వయంసహాయక బృందాల్లోని మహిళలకు ఆయన అవగాహన కల్పించారు. సైబర్ నేరాలకు గురైతే టోల్ ఫ్రీ నంబర్ 1930 లేదా www.cybercrime. gov.in పోర్టల్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ యాసిన్, జంగాలపల్లి, ములుగు సీసీలు భీమా, చంద్రమౌళి, కానిస్టేబుల్ శ్రీకాంత్, ఉమా, మహేశ్వర్, తేజస్వి, శ్వేత పాల్గొన్నారు.

పెళ్లింట్లో విషాదం..

కుమారుడి పెళ్లైన రెండు రోజులకే బ్రెయిన్ స్ట్రోక్‌తో తండ్రి మృతి

వాజేడు, మార్చి 5 : పెండ్లి వేడుకల అనంతరం వధూవరులతో కళకళలాడాల్సిన ఆ ఇంట్లో కుటుంబ పెద్ద మృతి చెందడంతో విషాద చాయలు నెలకొన్నాయి. వాజేడు మండలంలోని సుందరయ్యకాలనీ గ్రామానికి చెందిన అక్కిశెట్టి ఏసుబాబు(48) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ బుధవారం వరంగల్ ఎంజీఎంలో మృతిచెందాడు. మృతుడి బంధువులు తెలిపిన ప్రకారం వివరాల్లోకి వెళ్తే.. సుందరయ్యకాలనీ గ్రామానికి చెందిన అక్కిశెట్టి ఏసుబాబు వ్యవసాయం భూమి కౌలుకు తీసుకుని మిర్చి పంట చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కుమారులు హరికృష్ణ, శివకృష్ణ ఉన్నారు. పెద్దకుమారుడు శివకృష్ణకు భద్రాద్రికొత్తగూడెం జిల్లా కలివేరు గ్రామానికి చెందిన యువతితో ఈనెల 3వ తేదీ సోమవారం వివాహమైంది. ఈ నెల 4తేదీ మంగళవారం వరుడి ఇంట్లో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం కండ్లు తిరుగుతున్నాయని ఏసుబాబు తెలుపడంతో స్థానిక ఆర్ఎంపీకి చూపించారు. ఆర్ఎంపీ వైద్యం అందించిన అనంతరం వాంతులు కావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు ఏటూరునాగారంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యుడు ఏసుబాబు బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైనట్లు గుర్తించి వరంగల్‌కు తరలించాలని సూచించడంతో హనుమకొండలోని ప్రైవేట్ వైద్యశాలకు, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు. కుమారుడి వివాహమైన రెండు రోజులకే వరుడి తండ్రి చనిపోవడంతో ఆ కుటుంబంలో విషాదచాయలు అలముకున్నాయి.

9న న్యాయనిపుణుల సదస్సు

వాజేడు, మార్చి 5 : భద్రాచలం కేంద్రంగా న్యాయకళాశాల ఏర్పాటు కోరుతూ న్యాయనిపుణులతో ఈనెల 9న వెంకటాపురం మండలంలోని కఫెడ్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించే సదస్సుకు ఆదివాసీలు అధిక సంఖ్యలో తరలిరావాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు పునెం ప్రతాప్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం మండలంలోని గుమ్మడిదొడ్డి, కొంగాల, కోయవీరపురం, పెనుగోలుకాలనీ, చెరుకూరు తదితర గ్రామమాల్లో పర్యటించి గ్రామస్తులకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సురేశ్, రాజారాం, సుధాకర్, రాజబాబు, వెంకటేశ్, వినోద్, భుజంగరావు, రాకేశ్ పాల్గొన్నారు.

గుట్ట నుంచి గుడికి చేరిన పెద్దదేవర

మంగపేట, మార్చి 5 : మండలంలోని మల్లూరు శివారు మామిడిగూడెంలో గత రెండు రోజులుగా జరుగుతున్న శ్రీసమ్మక్క-సారలమ్మ జాతరలో భాగంగా బుధవారం రాత్రి గుట్టమీద నుంచి డోలు వాయిద్యాలు, ఊరేగింపుతో పెద్దదేవర గుడికి చేరింది. నేడు(గురువారం) వనదేవతలు సమ్మక్క, సారలమ్మలు గద్దెకు చేరుట, సాయంత్రం గంగ స్నానాలు, రాత్రి జాతరలో ముఖ్య ఘట్టమైన సమ్మక్క-పగిడిద్దరాజు కల్యాణం, ముళ్ల ఊయల తదితర కార్యక్రమాలుంటాయని దేవర బాలలు, పూజారులు తెలిపారు. వేడుకల్లో దేవర బాల పూటనెం జనార్దన్, వడ్డె రేగలక్ష్మయ్య, తలపతి పూనెం వెంకటేశ్వర్లు, దేవర కర్రలు ఆడించే వారు, గిరిజన కులపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అక్రమంగా పశువులను తరలిస్తే చర్యలు

వెంకటాపురం(నూగూరు), మార్చి 5 : మండల పరిధిలోని చొక్కాల గ్రామ సమీపంలో నాలుగు బొలోరో వాహనాల్లో పశువులను తరలిస్తున్న వ్యక్తులను, వాహనాలను బుధవారం పట్టుకున్నట్లు సీఐ బండారి కుమార్ తెలిపారు. వాహనాలను సీజ్ చేసి వాహనంలో పశువులను తరలిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన మహమ్మద్ షఫీ, ములుగు మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన రాజేందర్, సంపత్, సుగాలి రాజేందర్, మహేశ్, మల్లంపల్లి మండలానికి చెందిన మహ్మద్ సమీర్, యాసిన్‌పాషా, ఆత్మకూర్ మండలం నీరుకుల్ల గ్రామానికి చెందిన మహమ్మద్ జాఫర్లపై కేసు నమోదు చేశామని తెలిపారు. సీఐ వెంట ఎస్సై కొప్పుల తిరుపతిరావు, ఏఎస్సై రామచంద్రం, సిబ్బంది రాజమౌళి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

చిట్యాల, మార్చి 5 : పురుగుల మందు తాగి ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని చైన్‌పాక గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపి